క్లుప్తంగా

దరఖాస్తుల స్వీకరణ

కేతేపల్లి : తెలంగాణ ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్లకు కేతేపల్లి ఉన్నత పాఠశాలలో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ రమాదేవి, సహాయ కోఆర్డినేటర్ కె.బుచ్చిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలోపు చదువు మధ్యలో మానేసినవారు రికార్డు షీటు, ఆధార్ కార్డు, పాస్ ఫొటో అందజేసి పదో తరగతిలో అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. ఇంటర్‌లో చేరేవారు పదో తరగతి మెమో, టీసీ, ఆధార్ కార్డు, పాస్ ఫొటోతో ఈ నెల 13వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9441339731, 9247248971 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కలెక్టర్‌కు వినతి

నల్లగొండ టౌన్ : గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో డైలీవేజ్, పార్ట్ టైం వర్కర్లకు గిరిజన సంక్షేమ శాఖ అధికారి ద్వారా వేతనాలు చెల్లించాలని, అదేవిధంగా పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. జిల్లాలో సుమారు రెండు వందల మంది డైలీవేజ్ వర్కర్లు పనిచేస్తున్నారని, చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం చెల్లించాలని, అర్హులైన వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. కంభంపాటి శంకర్, సంగ్యానాయక్, రమేష్‌నాయక్, శంకర్‌నాయక్, చినానాయక్, పద్మ, మరియమ్మ, దేవా, అంజయ్య పాల్గొన్నారు.

బహుజన సాహిత్య అకాడమీ ప్రధాన కార్యదర్శిగా రమేష్



నియామక పత్రం అందజేస్తున్న రాధాకృష్ణ

కట్టంగూర్ : బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్ఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కట్టంగూర్ మండలంలోని ఎరసానిగూడెం గ్రామానికి చెందిన గంగదేవి రమేష్‌ను నియమిస్తూ బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ, జనరల్ సెక్రటరీ సుబ్రమణ్యన్, కమిటీ సభ్యుడు నీరుడు కృష్ణ, ఆఫీసు ఇన్‌చార్జ్ విష్ణులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫాతిమాషేక్ జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : భారతదేశ మొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమాషేక్ 192వ జయంతిని స్థానిక ప్రకాశం బజార్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఏ నజీర్, నజీరుద్దీన్, కట్టెల శివకుమార్, ఎండీ మసియుద్దీన్, బషీర్, జాఫర్, మహ్మద్‌హుసేన్, అస్రార్, వజీద్, ఎండీ సలీవుద్దీన్, నఖీహుసేన్, ఎండీ ఖలీల్‌అహ్మద్, పాండరి పాల్గొన్నారు.

వసతుల కల్పనలో విఫలం

కేతేపల్లి : గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు సరైన వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్ఎస్‌యూఐ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అల్లి అంజన్‌కుమార్‌యాదవ్ విమర్శించారు. సోమవారం ఆయన కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభమై ఆరు నెలలు దాటినా విద్యార్థులకు నేటికీ పూర్తిస్థాయిలో యూనిఫాంలు అందలేదన్నారు.

కాంతారెడ్డి మృతికి సంతాపం

నల్లగొండ టౌన్ : తెలంగాణ సాయుధ పోరాటయోధుడు, సీపీఎం సీనియర్ నాయకుడు ఉప్పల కాంతారెడ్డి మృతికి సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో సంతాపాన్ని తెలియజేశారు. సాయుధ రైతాంగ పోరాటంలో మునగాల పరగణతోపాటు కోదాడ, గరిడేపల్లి, నడిగూడెం సమీందారులకు వ్యతిరేకంగా పోరాటం చేయడంలో కాంతారెడ్డి కీలకపాత్ర పోషించారని కొనియాడారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కట్టంగూర్ : తెలంగాణ చేనేత కార్మిక సంఘం 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆ సంఘం నాయకులతో కలిసి సోమవారం నల్లగొండలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కందగట్ల గణేశ్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు సిద్దిరాల నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కర్నాటి శ్రీరంగం, రావిరాల మారయ్య, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న, నామిని ప్రభాకర్, సాయి ఉన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అక్కడ ఫిర్యాదు.. ఇక్కడ దర్యాప్తు !

- పాత మండలాల్లోనే ఫిర్యాదులు స్వీకరిస్తున్న పోలీసులు
- దర్యాప్తు మాత్రం గట్టుప్పల స్టేషన్‌లో..
- నూతన మండలానికి పూర్తిస్థాయి సిబ్బందిని నియమించని ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న ఫిర్యాదుదారులు



చండూరు(గట్టుప్పల) : ఇటీవల నూతనంగా ఏర్పాటుచేసిన గట్టుప్పల మండల పోలీస్‌స్టేషన్ సిబ్బందికి ప్రభుత్వం పూర్తి బాధ్యతలు అప్పగించలేదు. పూర్తిస్థాయి సిబ్బందిని కూడా ఏర్పాటు చేయలేదు. ఎస్ఐ, ఒకరిద్దరు సిబ్బంది పూర్తి బాధ్యతలు లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఫిర్యాదు పాత మండలాల్లోనే..

చండూరు మండలంలోని గట్టుప్పల, తేరటిపల్లి, మునుగోడులోని వెల్మకన్నె, మర్రిగూడెంలోని అంతంపేట, సోమరాజుగూడెం, నామాపురం గ్రామాలను కలిపి ఇటీవల గట్టుప్పల మండలంగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గట్టుప్పల మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసినా మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు పాత పోలీస్‌స్టేషన్ పరిధిలోనే ఫిర్యాదు చేయాల్సి వస్తోంది. వెల్మకన్నె గ్రామ ప్రజలు మునుగోడు పోలీస్ స్టేషన్‌లో, గట్టుప్పల్, తేరటిపల్లి ప్రజలు చండూరులో, నామాపురం, అంతంపేట, సోమరాజుగూడెం ప్రజలు మర్రిగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి వస్తోంది. అయితే ఆ ఫిర్యాదులను మాత్రం గట్టుప్పల ఎస్ఐ దర్యాప్తు చేయాల్సి వస్తోంది. గట్టుప్పల ఎస్ఐ దర్యాప్తు చేసి నిర్ధారణ చేసి అక్కడి స్టేషన్‌కు పంపిస్తే ఆయా స్టేషన్లలో కేసు నమోదు చేస్తున్నారు. దీంతో ఫిర్యాదుదారులు అక్కడికి, ఇక్కడికి తిరుగుతూ బేజారవుతున్నారు. మండలం ఏర్పాటైనా పూర్తిస్థాయి సేవలు కల్పించకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఒకే ఒక్కరు..

గట్టుప్పలలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసినప్పటికీ ప్రభుత్వం సిబ్బందిని నియమించలేదు. ఫలితంగా శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది. ప్రస్తుతం స్టేషన్‌కు ఒక ఎస్ఐని మాత్రమే నియమించారు. ప్రతిరోజు మునుగోడు, కనగల్ స్టేషన్ల నుంచి ఇద్దరు చొప్పున సిబ్బంది ఇక్కడికి వచ్చి విధులు నిర్వహించి వెళ్తున్నారు. ఇటు సిబ్బంది లేక, అటు పూర్తి బాధ్యతలు లేక ఎస్ఐకి తిప్పలుతప్పడం లేదు. గట్టుప్పల పోలీస్‌స్టేషన్‌కు వెంటనే పూర్తిస్థాయి సిబ్బందిని కేటాయించి బాధ్యతలు అప్పగించాలని ప్రజలు కోరుతున్నారు.

సౌకర్యాలు నిల్

పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించడానికి వచ్చే సిబ్బందికి స్టేషన్‌లో కనీస సౌకర్యాలు లేవు. ఎస్‌హెచ్‌ఓకు ఓ గది ఉండగా, సిబ్బంది విశ్రాంతి తీసుకోవడానికి మరో గది మాత్రమే ఉంది. స్టేషన్‌లో నీటి సౌకర్యం లేక వచ్చే ఫిర్యాదుదారులకు, సిబ్బందికి ఇబ్బంది తప్పడం లేదు. సిబ్బంది, ఫిర్యాదుదారులు కూర్చునేందుకు సరిపోను కుర్చీలు కూడా లేవు.

పూర్తి బాధ్యత అప్పగించాలి



గట్టుప్పల మండలం ఏర్పాటు సంతోషం. అదేవిధంగా స్టేషన్‌కు పూర్తి బాధ్యతలు అప్పగించాలి. వేరే స్టేషన్‌లో ఫిర్యాదు, ఇక్కడ దర్యాప్తుతో ఫిర్యాదుదారులకు ఇబ్బందిగా ఉంది. మండలం ఏర్పాటుతోపాటు అన్ని కార్యాలయాలు ఏర్పాటు చేయాలి. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో గట్టుప్పల ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన ఐటీ మంత్రి కేటీఆర్ ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

– బొట్టు శివ కుమార్, సీపీఎం

త్వరలో సిబ్బందిని ఏర్పాటుచేస్తాం



ప్రభుత్వ నిబంధనల మేరకు స్టేషన్‌లో పూర్తి బాధ్యతలు అప్పగిస్తాం. త్వరలో సిబ్బందిని ఏర్పాటు చేస్తాం. ఫిర్యాదుదారులు అక్కడే ఫిర్యాదు చేయండి. అక్కడే దర్యాప్తు జరుగుతుంది. సమస్యలు ఉంటే నాకు ఫోన్ ద్వారా సమాచారం అందించండి.

– అశోక్‌రెడ్డి, సీఐ చండూరు

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

నకిరేకల్ : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్ రావు సూచించారు. నకిరేకల్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షత సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు కరోనా బారిన పడకుండా త్వరితగతిన బూస్టర్ డోస్‌ను పూర్తిచేయాలని ఆదేశించారు. 18 ఏళ్లలోపు బాలబాలికల సమస్యల పరిష్కారానికి బాలల పరిరక్షణ కమిటీలు వేయాలని సూచించారు. అనంతరం పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ లక్ష్మారెడ్డి, మండల పంచాయతీ అధికారి నాగలక్ష్మి, మండల కో ఆప్షన్ సభ్యుడు ఖాసీం, ఎంపీటీసీలు సామ మల్లమ్మ, గాదగోని శ్రీలత, దాసరి వీరార్జున్‌రెడ్డి, లోడె సాగర్, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డుగా విస్తరించాలని సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండ రూరల్ : ముశంపల్లి–నల్లగొండ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించాలని డిమాండ్ చేస్తు సీపీఎం నాయకులు సోమవారం వెలుగుపల్లిలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నిత్యం ముశంపల్లి, వెలుగుపల్లి, రసుల్‌పురం, అన్నారం, అన్నారెడ్డిగూడెం గ్రామాల నుంచి రైతులు నల్లగొండ పట్టణానికి పాలు, కూరగాయలతో వాహనాలు, ఆటోల్లో వెళ్తుంటారని, రోడ్డు బాగాలేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు బాగాలేకపోవడం వల్ల త్రిపురారం, మాడుగులపల్లి, తదితర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చే రైతులు, వ్యాపారుల వాహనాలు గుల్లకావడంతోపాటు అసౌకర్యానికి గురవుతున్నట్లు తెలిపారు. డబుల్ రోడ్డుగా విస్తరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న ముశంపల్లి నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున, మండల కార్యదర్శి నలపరాజు సైదులు, పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, అంజయ్య, యాదగిరి, బక్కయ్య, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి మండలం ఎర్రగడ్డలగూడెం గ్రామానికి చెందిన పేరం మార్కండేయ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం సర్పంచ్ శైలజసతీష్‌రెడ్డి ద్వారా అందజేశారు. బాధిత కుటుంబానికి, పిల్లల ఉన్నత చదువులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాదె శ్రీనివాస్‌రెడ్డి, గూడురు వెంకట్‌రెడ్డి, గండమళ్ళ దేవదాసు, బొబ్బిలి సైదులు, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

చండూరు : మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన గిరి సత్తయ్య(60) ఇటీవల తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు పడి మృతి చెందారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి కారంకి ఫౌండేషన్, గౌడ్స్ అండ్ గౌడ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు కారంకి శివనారాయణ గౌడ్, వంగ రాములుగౌడ్, నకిరేకంటి లింగంగౌడ్, మోర్ల ఏడుకొండలుగౌడ్, మద్దెల హరీశ్‌గౌడ్, దేశం మహేష్ గౌడ్‌ల ఆధ్వర్యంలో పదివేల రూపాయల చెక్కు అందించారు.

నల్లగొండ రూరల్ : నల్లగొండ మండలంలోని దండెంపల్లి గ్రామానికి చెందిన అల్లి ఎల్లయ్య, బాతుక రాజు అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు పిల్లి రామరాజుయాదవ్ పరామర్శించి రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఉప సర్పంచ్ శ్రవన్‌కుమార్, మాజీ సర్పంచ్ వెంకన్న, గిరి, శ్రీశైలం, బాతుక యాదగిరి, పావన గుండ్ల రవి, కృష్ణయ్య, శంకర్ పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నాయకుల అరెస్ట్

మునుగోడు : పోలీసు ఉద్యోగాల నియామకాల్లో అవకతవకలను సరిచేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రగతి భవన్ ముట్టడికి తరలివెళ్లకుండా ఆ సంఘం నాయకులతోపాటు పలువురు నిరుద్యోగులను సోమవారం స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టయినవారిలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి తిరిపారి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, వంశీ, ప్రసాద్, అబ్దుల్‌తాజ, సైదులు ఉన్నారు.

డీవైఎఫ్ఐ ఉపాధ్యక్షుడిగా మహేష్

చిట్యాల : మండలంలోని నేరడ గ్రామానికి చెందిన వడ్డెగాని మహేష్ డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. నల్లగొండలో జరిగిన డీవైఎఫ్ఐ సమావేశంలో తనను ఎన్నుకున్నట్లు సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంపీఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అథర్ ఫర్వేజ్



కట్టంగూర్ : హైదరాబాదులో ఆదివారం జరిగిన మండల పంచాయతీ అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అథర్ ఫర్వేజ్‌ను రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అథర్ ఫర్వేజ్‌కు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేషంజన్ నియామక పత్రం అందజేశారు. అనంతరం ఫర్వేజ్ మాట్లాడుతూ పంచాయతీ అధికారుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానన్నారు.

క్రికెట్ కిట్ అందజేత



క్రికెట్ కిట్ అందజేస్తున్న శేపూరి రవీందర్

చిట్యాల : మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో క్రీడాకారులకు బీజేపీ రాష్ట్ర నాయకుడు శేపూరి రవీందర్ సోమవారం క్రికెట్ కిట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గంజి గోవర్ధన్, ఇమ్మడి విజయ్, రావుల వెంకన్న, రాచకొండ శ్రీనివాస్, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు గరిషె శేఖర్, చెరుకు రామలింగం, జవ్వాజి రమేష్, అనిల్, రాజు, మహేష్ పాల్గొన్నారు.

క్రీడాకారుల సంక్షేమానికి కృషి



కబడ్డీ పోటీల ప్రారంభం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎంపీ, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి



పోటీ పడుతున్న సిరిపురం- వనిపాకల జట్లు

నకిరేకల్ : క్రీడాకారుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చిరుమర్తి చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నకిరేకల్ మినీస్టేడియంలో మూడు రోజులపాటు జరుగనున్న ప్రభుత్వ పాఠశాలల నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు సోమవారం జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల సౌకర్యార్థం బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసిందని తెలిపారు. జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజమని, ప్రతి క్రీడాకారుడు మెరుగైన ఆటతీరు ప్రదర్శించాలన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కబడ్డీ పోటీలను తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా తమ ప్రతిభ చూపాలని కోరారు. చిరుమర్తి ఫౌండేషన్ ప్రతినిధి మనోజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఈఓ భిక్షపతి, ట్రస్మా అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, నకిరేకల్, చిట్యాల మున్సిపల్ చైర్మన్లు రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, చినవెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీలు మాద ధనలక్ష్మీనగేష్, బలరాం, స్వర్ణలత, సునీత, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి ,క్రీడల నిర్వాహకులు చింతకాయల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బరిలో 100 టీమ్‌లు

కబడ్డీ పోటీల్లో నియోజకవర్గంలోని ఆరు మండలాల జెడ్పీ హైస్కూల్ టీమ్‌లతోపాటు మోడల్, గురుకుల పాఠశాలల కలిపి మొత్తం 100 జట్లు తలపడుతున్నాయి. పోటీల ప్రారంభం సందర్భంగా నకిరేకల్ జెడ్పీ హైస్కూల్ నుంచి విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. క్రీడాకారులకు స్థానిక సాయి కల్యాణ మండపంలో భోజన వసతి కల్పించారు.

నీలగిరిలో ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు

- ఈ నెల 18న ప్రారంభం
- పాలకవర్గ సమావేశంలో చైర్మన్ సైదిరెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ మందడి సైదిరెడ్డి



సమావేశానికి హాజరైన పాలకవర్గ సభ్యులు

నల్లగొండ టూటౌన్ : పట్టణంలో కంటి వెలుగు కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి తెలిపారు. సోమవారం నీలగిరి మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో చైర్మన్ మందడి సైదిరెడ్డి అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ సైదిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి పట్టణంలోని ఏడు వార్డుల్లో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ వరకు 100 రోజులపాటు కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, మున్సిపల్, మెప్మా సిబ్బంది వార్డుల్లో ప్రజలకు అవగాహన కల్పించి కంటి పరీక్షలు చేయించుకునేలా చొరవ తీసుకోవాలని కోరారు. ప్రతిఒక్కరికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు, కళ్లజోడు ఇస్తారని, అవసరమైనవారికి ప్రభుత్వ ఆస్పత్రిలో ఆపరేషన్ చేస్తారని తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారు పట్టణంలో లక్షా 55 వేల మంది ఉన్నారని చెప్పారు. డీఎంహెచ్ఓ కొండల్‌రావు మాట్లాడుతూ ప్రతిరోజు 400 మందికి కంటి పరీక్షలు నిర్వహిస్తారని, క్యాంపుల వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సదుపాయాలు కల్పించాలని కోరారు. అంధత్వాన్ని నివారించేందుకే ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్ మాట్లాడుతూ 36వ వార్డులో స్థలం ఉన్నందున కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. యూజీడీ సమస్య త్వరగా పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు బొడ్డుపల్లి లక్ష్మిశ్రీనివాస్, కర్నాటి కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో శునకాల సమస్య జఠిలంగా ఉందని, వాటి నియంత్రణపై దృష్టి పెట్టాలని కోరారు. కౌన్సిలర్ యామ కవిత మాట్లాడుతూ కార్మికుల జీతాలకు సంబంధించి వేలిముద్ర సమస్య లేకుండా చూడాలని కోరారు. కోఆప్షన్ సభ్యుడు కొండూరు సత్యనారాయణ మాట్లాడుతూ పానగల్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో కంటి వెలుగు క్యాంపు పెట్టాలని కోరారు. సంజీవయ్య నగర్ కాలనీలో ఉన్న కమ్యూనిటీ హాల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను కోరారు. కమిషనర్ రమణాచారి మాట్లాడుతూ కార్మికులకు బయోమెట్రిక్ సమస్య లేదని, ఆలస్యంగా వస్తే వేలిముద్ర తీసుకోదని తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, మున్సిపల్ ఈఈ రాములు, అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముస్తాబ్ అహ్మద్, ఏసీపీ నాగిరెడ్డి, డీఈలు వెంకన్న, నరసింహారెడ్డి, అశోక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మూర్తుజాఅలీ, శంకర్, గడ్డం శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నోముల నర్సింహయ్యకు ఘన నివాళి

నకిరేకల్ : నాగార్జున సాగర్ దివంగత ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య రాజకీయ జీవితం మొత్తం బడుగుల బలహీన వర్గాల అభ్యున్నతికి, పేదల హక్కుల కోసం పనిచేశారని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, బీసీ ఫైనాన్స్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య అన్నారు. నకిరేకల్‌లో ఆకుల సోమన్న మిత్రమండలి ఆధ్వర్యంలో నోముల నర్సింహయ్య 67వ జయంతి వేడుకలను సోమవారం జరుపుకున్నారు. కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో నర్సింహయ్య అసెంబ్లీలో తన తెలంగాణ యాస, భాషతో ప్రజా సమస్యలను ప్రస్తావించాడని గుర్తుచేశారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మాచర్ల సైదులు మాదిగ, మామిడి సర్వయ్య, గాదగోని కొండయ్య, బండపల్లి శ్రీను, నోముల గోవిందరాజులు, ఏర్పుల తాజేశ్వర్, బొజ్జ సుందర్, గుత్తా మాధవ్ రెడ్డి, వలిశెట్టి స్వప్న, నకిరేకంటి నరేందర్, యాసారపు వెంకన్న, చొగోని శ్రీను, రాచకొండ వెంకట్, అంబేద్కర్, వంటెపాక కృష్ణ పాల్గొన్నారు.

కట్టంగూరు ఎస్ఐని సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న పాలడుగు నాగార్జున

నల్లగొండ టౌన్ : కట్టంగూరు మండలం ముత్యాలమ్మగూడెంకు చెందిన బాలిక కిడ్నాప్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కట్టంగూరు ఎస్ఐని వెంటనే సస్పెండ్ చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డిసెంబర్ 17న బాలికను అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్ మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసి సూరత్‌కు తీసుకెళ్లాడని తెలిపారు. 19వ తేదీన పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారన్నారు. కానీ రాజకీయ వత్తిడి వల్ల నిందితుడిని రిమాండ్ చేయకుండా ఎస్ఐ వదిలేశాడని ఆరోపించారు. తిరిగి నిందితుడు బాలికను డిసెంబర్ 30న కిడ్నాప్ చేశాడని, ప్రస్తుతం బాలిక ఎక్కడ ఉందో కూడా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఎస్ఐ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే బాలిక కిడ్నాప్ అయ్యిందన్నారు. ఈ సమావేశంలో బకరం శ్రీనివాస్‌మాదిగ, పందుల సైదులు, మాచర్ల సైదులు, మానుపాటి భిక్షం, రవీంద్రకుమార్, ఊట్కూరి యాదగిరి, వనం రాంబాబు, బండమీది లింగస్వామి, మన్నెం సునిత, శిరీష, నాగరాజు, కోటేష్, లింగస్వామి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

నకిరేకల్ : పట్టణంలోని మూసీ రోడ్డులో ఉన్న రిటైర్డు ఉద్యోగుల సంఘం భవనంలో సోమవారం హైదరాబాద్‌లోని మహాలక్ష్మీ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కంటి ఆపరేషన్ అవసరమైనవారికి ఉచితంగా రవాణ, భోజన సదుపాయంతోపాటు ఆపరేషన్ చేస్తామని సిబ్బంది రమేష్, రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సోమయ్య, భిక్షంరెడ్డి, శివకోటి ఆంజనేయులు పాల్గొన్నారు.

14 నుంచి క్రికెట్ పోటీలు

శాలిగౌరారం : మండలంలోని తిరుమలరాయునిగూడెంలో ఈ నెల 14 నుంచి 17 వరకు మండలస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. ప్రథమ బహుమతి రూ.15116, షీల్డ్, ద్వితీయ బహుమతి రూ.12116, షీల్డ్, తృతీయ బహుమతి రూ.1011, షీల్డ్, నాలుగో బహుమతి రూ.8116, షీల్డ్‌లను అందజేయనున్నట్లు వారు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచినవారు తమజట్టు పేరును ఈ నెల 13 వరకు సెల్‌ఫోన్ నంబర్లు 9550055859, 9160614295, 9642354991లను సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు.

డీఎస్పీకి వినతి

నల్లగొండ క్రైం : నల్లగొండ పట్టణంలో మార్వాడీలు మొబైల్ ఫోన్లకు సంబంధించిన రిటైల్ వ్యాపారం చేయడంతో తాము నష్టపోతున్నామని, వారు రిటైల్ వ్యాపారం చేయకుండా నివారించాలని కోరుతూ పట్టణంలోని మొబైల్ షాప్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం నల్లగొండ డీఎస్పీకి వినతి పత్రం అందజేశారు. దుకాణాలకు కనీసం నెల కిరాయి చెల్లించలేని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తంచేశారు. టెలికం సంస్థల సిమ్‌లు, ఫోన్ గ్లాస్‌లు రోడ్లపై గొడుగులు పెట్టి విక్రయించేవారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో అసోసియేషన్ నాయకులు రాజు, శ్రీనివాసులు, అజీమ్, భాస్కర్, పాష, మురళీకృష్ణ గౌడ్, కరుణాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్యామ్‌సుందర్ రెడ్డి, ముస్తాక్, లవకుమార్ ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ సభ్యులు

16నుంచి యోగా శిక్షణ తరగతులు

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని లయన్స్ క్లబ్ భవనంలో వైదిక యోగా పీఠ్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి ఉచితంగా యోగా శిక్షణ తరగతులు ప్రారంభమవుతున్నట్లు యోగా గురువు కరుణాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు 21 రోజులపాటు శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు.

మహాసభల పోస్టర్ విడుదల

నకిరేకల్ : ఈ నెల 13,14 తేదీల్లో రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో జరగబోయే టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 5వ మహాసభలకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను నకిరేకల్‌లో సోమవారం ఆ సంఘం జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు తాటిపాముల నర్సింహమూర్తి, జిల్లా మహిళా కన్వీనర్ చింతమళ్ల వరలక్ష్మి, గంగాధర భద్రయ్య, చింతపల్లి రవీందర్, శ్రీనివాస్‌రావు, బాలాజీ, శంకరయ్య పాల్గొన్నారు.

మర్రిగూడలో..

మర్రిగూడ : ఈ నెల 13, 14 తేదీల్లో రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో నిర్వహించే టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి కె.కృష్ణారెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు భిక్షమయ్యతో కలిసి మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పి.పరమేశ్వరి, ఎం.వెంకటేశ్వర్లు, డి.సుందరయ్య, బి.దీవంత, శ్రీనయ్య, నారాయణరెడ్డి, శ్రీను, మంజుశ్రీ, సుధారాణి, అంజయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్టు

కేతేపల్లి : హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తలపెట్టిన ధర్నాకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న మండలంలోని కాంగ్రెస్ నాయకులను కేతేపల్లి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయినవారిలో కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి, డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు జటంగి వెంకటనర్సయ్యయాదవ్, డీసీసీ కార్యదర్శి కోట పుల్లయ్య, కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు నకిరెకంటి మంగమ్మ, బయ్యె ముత్తయ్య తదితరులు ఉన్నారు.

డ్రాయింగ్ బుక్స్ పంపిణీ

చిట్యాల : పట్టణంలోని భవిత విద్యావనరుల కేంద్రంలో చిన్నారులకు సోమవారం సత్యసాయి సేవా సమితి సభ్యులు మేడిశెట్టి రూప్సీ, చంద నాగలక్ష్మి, ఏళ్ళ జ్యోతి, దోగిపర్తి సువర్ణలు డ్రాయింగ్ బుక్స్, పోషకాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు బోయ శ్రీనివాసులు, సీఎస్ హెచ్‌ఎం స్లీవమ్మ, బాదం భిక్షపతి, సరిత, వరలక్ష్మి, ప్రమీల, సత్యసాయి సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.